## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సు ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి పొందూరు మండలం తాడివలస వెళ్లే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మార్గమధ్యలో ఉన్న లొద్దపేట గ్రామంలో ప్రతిరోజూ గ్రామస్తులను దించేసి వెళ్తుంది. అయితే శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఆ బస్సు లొద్దలపేట గ్రామంలోకి వెళ్లకుండా జంక్షన్ వద్ద గ్రామానికి చెందిన కొంతమంది విద్యార్థులు, ప్రయాణికులను దించేశారు. దీంతో ప్రయాణికులంతా ఒక కిలోమీటరు దూరంలో ఉన్న తమ గ్రామానికి బిక్కుబిక్కుమంటూ తోటల్లోంచి ప్రయాణించి చేరుకున్నారు. విషయాన్ని తమ గ్రామ పెద్దలకు చెప్పడంతో బస్సు తిరుగు ప్రయాణంలో లొద్దలపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి గ్రామస్తులు చేరుకొని బస్సు ఎదుట నిరసన తెలిపారు. లొద్దలపేట గ్రామంలోకి బస్సు ఎందుకు రాలేదని డ్రైవర్, కండక్టర్లను నిలదీశారు. దీంతో వారు సాంకేతిక కారణాల వల్ల బస్సు గ్రామంలోకి తీసుకెళ్లలేదని సమాధానం చెప్పారు. అయితే గ్రామస్తులు డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. మరోసారి ఇలా జరగకుండా చూడాలని కోరారు. సుమారు గంట పాటు సాగిన ఈ నిరసన గ్రామ పెద్దల జోక్యంతో సద్దుమణిగింది.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని సుభలయలో ఉన్న సంతోషిమాత ఆలయ 12వ వార్షికోత్సవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సాహుకారి గోవిందరావు, మంగమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### రెడ్డి శాంతికి సత్కారం



రెడ్డి శాంతిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా నియమితులైన విషయం తెలిసిందే. దీంతో ఆమెను ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి బుర్లె శ్రీనివాసరావు శుక్రవారం పాతపట్నంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నీటి తీరువా చెల్లించాలి

కొత్తూరు: రైతులు తమ భూములకు నీటి తీరువాలను చెల్లించాలని తహసీల్దార్ కె.బాలకృష్ణ సూచించారు. మండలంలోని కర్లెమ్మ, సిరుసువాడ, కుంటిభద్ర తదితర గ్రామాల్లో సర్పంచ్ ఎల్.భగవాన్‌దాసు నాయుడు అధ్యక్షతన గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నీటి తీరువా బకాయిలు ఉన్న రైతులు తక్షణమే వీఆర్వోలకు చెల్లించి రశీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

### చెరువులను పరిరక్షించాలి

పాతపట్నం: ప్రతి ఒక్కరూ చెరువులను పరిరక్షించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బి.నారాయణమూర్తి అన్నారు. పాతపట్నంలోని ఎర్ర చెరువుకు శుక్రవారం జల హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పి.మోహన్‌రావు, ఎస్.శరత్‌కుమార్, ఆర్.షణ్ముఖరావు, పి.రామారావు, కె.రాజు, తిరుపతిరావు, శ్రీధర్, భాస్కరరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి

నరసన్నపేట: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని రాజమండ్రి సీటీఆర్ఐ శాస్త్రవేత్త అనిందతా పాల్ అన్నారు. మండలంలోని మడపాంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులు కీలకమన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరికుమార్, రాగోలు శాస్త్రవేత్త ఎం.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు కె.సునీత, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త శైలజ, పెద్దపేట ఉద్యానశాఖ ప్రధాన శాస్త్రవేత్త పి.అశోక్‌లు మాట్లాడుతూ.. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ శ్రీనివాసరావు, ఉద్యానశాఖ అధికారి అయంతి పాల్గొన్నారు.



నాడు-నేడు పాఠశాలలో గ్రీన్ బోర్డుపై విద్యా బోధన



నాడు-నేడుతో అభివృద్ధి చెందిన రావిచంద్రి పాఠశాల



నాడు - నేడులో భాగంగా విద్యార్థులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

# నాడు బాగుబడి.. నేడు చతికిలబడి

- వైఎస్సార్‌సీపీ హయాంలో సుందరంగా సరస్వతీ నిలయాలు
- కార్పొరేట్ బడిని తలదన్నేలా సదుపాయాలు
- కూటమి హయాంలో ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం

#### వైఎస్సార్‌సీపీ హయాంలో...

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా తీర్చిదిద్దారు. బడి గోడలపై ఆకట్టుకునే రంగుల బొమ్మలు, సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బై లింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీరు, తరగతి గదుల్లో కూర్చునేందుకు బల్లలు, ఫ్యాన్లు, మెరుగైన మరుగుదొడ్లు, విశాలమైన తరగతి గదులు, బడికి రక్షణ గోడ ఇలా అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త హంగులు కల్పించారు.

#### ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో...

ఊరులో ఉన్న పాఠశాలలు కనుమరుగవుతున్నాయి. ఒక ఊరులో ఉన్న ప్రభుత్వ పాఠశాల పక్క ఊరిలో ఉన్న పాఠశాలలో విలీనం అయింది. ప్రభుత్వం చేపట్టిన సర్దుబాటు పద్ధతులతో ఉపాధ్యాయలు మిగిలిపోతున్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. ప్రభుత్వ విద్యకు మంగళం పాడి తనకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్ యజమానులను ప్రోత్సహిస్తున్నట్లు ఉంది సీఎం చంద్రబాబు పాలన.




వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత సరస్వతీ నిలయాలుగా చెప్పుకునే పాఠశాలలు సర్వాంగ సుందరంగా మారిపోయాయి. నాడు-నేడు అనే పథకం తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని కొంతపుంతలు తొక్కించారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యా బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడేలా తయారు చేశారు. నాడు-నేడు ఫేజ్ 1, 2 పేరుతో అవసరం ఉన్నచోటఅదనపు భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మించారు. గదులకు రిపేర్లు, ఆకర్షణీయంగా రంగులు, గోడలపై రకరకాల బొమ్మలు, విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, గ్రీన్ బోర్డులు, పాఠశాలలకు రక్షణ గోడ, సిబ్బంది కోసం ప్రత్యేక ఫర్నీచర్, అధునాతనంగా మరుగుదొడ్లు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, సాంకేతిక బోధన కోసం ఎల్ఈడీ టీవీలు... ఇలా నాడు-నేడు పథకంలో భాగంగా ఎన్నో పనులు చేపట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వం బడిని చూస్తే జగన్‌మోహన్‌రెడ్డి గుర్తొచ్చేలా తీర్చిదిద్దారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది కాలంలో వీధి బడి నిర్లక్ష్యానికి లోనవుతోంది. పాఠశాలల అభివృద్ధి మాటను పక్కనబెడితే ఉన్న బడులను విలీనం పేరుతో తరలించి, పేదవాడికి ప్రాథమిక విద్య దూరమయ్యేలా చేస్తున్నారు.

- ఎల్.ఎన్.పేట

**నాడు - నేడు పథకంతో జరిగిన అభివృద్ధి**

| మండలం | మంజూరైన నిధులు (రూ.కోట్లలో) | ఖర్చు చేసిన నిధులు (రూ.కోట్లలో) | పనులు జరిగిన పాఠశాలలు |
|---|---|---|---|
| **పాతపట్నం నియోజకవర్గం** | | | |
| పాతపట్నం | 19.03 | 10.95 | 59 |
| మెళియాపుట్టి | 19.02 | 12.56 | 58 |
| ఎల్.ఎన్.పేట | 7.36 | 4.23 | 28 |
| కొత్తూరు | 23.13 | 12.66 | 65 |
| హిరమండలం | 13.89 | 5.94 | 45 |
| **నరసన్నపేట నియోజకవర్గం** | | | |
| నరసన్నపేట | 28.90 | 20.20 | 69 |
| సారవకోట | 14.42 | 11.00 | 45 |
| పోలాకి | 27.50 | 14.40 | 63 |
| జలుమూరు | 35.77 | 23.00 | 59 |
| **ఆమదాలవలస నియోజకవర్గం** | | | |
| ఆమదాలవలస | 16.00 | 16.00 | 37 |
| బూర్జ | 6.00 | 5.63 | 28 |
| పొందూరు | 7.93 | 7.00 | 27 |
| సరుబుజ్జిలి | 2.64 | 2.64 | 13 |

#### సరదాగా స్కూల్‌కి



ప్రస్తుతం మా పాఠశాలలో ఎన్నో సదుపాయాలు ఉన్నాయి. దీంతో సరదాగా ప్రతిరోజూ పాఠశాలకు వెళ్తున్నా. ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీరు, మంచి మరుగుదొడ్లు, తరగతి గదులు, చుట్టూ ఆకర్షణీయంగా ఉన్న మొక్కలు, ఎంతో చక్కగా పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే నా తోటి స్నేహితులు మా ప్రభుత్వ పాఠశాల బాగుందని చెబుతుంటే నాకు సంతోషంగా ఉంటుంది.

– గంగరాపు భాను, 9వ తరగతి, ఎల్.ఎన్.పేట

#### అందంగా తీర్చిదిద్దారు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మా ఊరుకి పక్కనే ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి చెందింది. అంతకుముందు శిథిలావస్థలో ఉన్న బడిని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. నాడు-నేడు పథకంలో భాగంగా అవసరమైన పనులు చేపట్టారు.

– కర్నం చంద్రినాయుడు, జాడుపేట, ఎల్.ఎన్.పేట

#### అంతకుముందు నేలపైనే చదువులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వకముందు మా ఊరు బడిలో పిల్లలు నేలపైనే కూర్చొని చదువుకునేవారు. జగనన్న వచ్చిన తర్వాత నాడు-నేడులో భాగంగా బడిని చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు వచ్చాయి. మరుగుదొడ్ల సమస్య తీరింది. బడి చుట్టూ గోడ కట్టడంతో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే అవకాశం లభించింది.

– పల్లి సంజీవ్, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

#### బాగా అభివృద్ధి చేశారు



నా చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలకు.. ఇప్పుడు పిల్లలు చదువుతున్న పాఠశాలకు ఎంతో తేడా ఉంది. నా చిన్నప్పుడు ప్రభుత్వ బడుల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో ఎంతో బాగా తయారు చేశారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగేలా తీర్చిదిద్దారు.

– అశోక్ పాణిగ్రహి, పాఠశాల కమిటీ సభ్యుడు, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

#### డిజిటల్ విద్య వచ్చింది



నాడు-నేడుతో పాఠశాలలు బాగుబడడంతో పాటు విద్యార్థులకు డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చింది. గ్రీన్ బోర్డుతో అకర్షిస్తూ, డిజిటల్ విద్యతో విద్యార్థులకు కార్పొరేట్ బోధన తీసుకొచ్చారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. విద్యా విధానంలోను, విద్యా వ్యవస్థ అభివృద్ధిలోను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకతను చాటుకున్నారు.

– వాదమ శ్రీనివాసరావు, కొత్తూరు

## వెన్నుపోటు దినం జయప్రదం చేయాలి



పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు జూన్ 4వ తేదీన చేపట్టనున్న వెన్నుపోటు దినం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తుచేస్తూ వెన్నుపోటు దినం నిర్వహించాలన్నారు. ఆ రోజు పార్టీ శ్రేణులు పాతపట్నంలోని క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని, అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతి, పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పెనుమజ్జి విష్ణుమూర్తి, మీసాల రామకృష్ణ, గండివలస ఆనంద్, పోలాకి జయమునిరావు, రాష్ట్ర కార్యదర్శి పి.యోగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సాంబమూర్తి, రెడ్డి రామారావు, బైపోతు ఉదయ్ కుమార్, ఆర్టీఐ ఎనుగుత సూర్యం, ఏవీ సురేష్, చింతాడ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ వంగపల్లి చిన్నారావు, యరుకొల వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్లు గోకవలస రామారావు, పనుకు మోహన్, జనరల్ కార్యదర్శులు టంకాల సుధ, చింతాడ త్రినాథరావు, పిన్నింటి ఫాల్గునరావు, మురళీ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

#### ఉచిత వైద్య శిబిరం నేడు

ఆమదాలవలస: పట్టణంలోని చిట్టెమ్మ క్వార్టర్స్‌లో ఉన్న మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా సంస్థ అధ్యక్షుడు మెండ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కేవీవీ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

#### ఏడు బైకులు స్వాధీనం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస ప్రాంతంలో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

#### వైభవంగా కుంకుమ పూజలు

పొందూరు: మండలంలోని బురిడి కంచరాం గ్రామంలో గణపతి సుబ్రహ్మణ్య సహిత అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు.

#### ఆలయానికి ఊయల వితరణ

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి ఒడిశా రాష్ట్రంలోని కటక్‌పూర్‌కు చెందిన కోన మణి కుమార్, పూజా దంపతులు శుక్రవారం ఊయల వితరణగా అందజేశారని ఆలయ ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. ఊయల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ఆలయంలో చిన్నపిల్లల ఊయల కార్యక్రమానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

#### శిక్షణ కేంద్రాలు వినియోగించుకోవాలి

కొత్తూరు: కుట్టు శిక్షణ కేంద్రాలను శిక్షణదారులు సద్వినియోగపరుచుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ సూచించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ఇటువంటి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తుందన్నారు.

## మినీ గోకులం... బిల్లులకు ఇంకెంత కాలం..?

- లబ్ధిదారులకు బిల్లులు చెల్లించని వైనం
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



పాత హిరమండలంలో నిర్మించిన గోకులం షెడ్

హిరమండలం: పాడి పరిశ్రమను బలోపేతం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కుతూనే నానా హడావుడి చేసింది. మినీ గోకులాలు పేరిట గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టింది. పశుపోషకులకు 90 శాతం రాయితీపై షెడ్లు నిర్మిస్తున్నామంటూ ఊదరగొట్టింది. దీంతో కొంతమంది పాడి రైతులు, పశు పోషకులు, జీవాల కాపరులు ముందుకొచ్చి నిర్మాణాలు చేపట్టారు. తీరా నిర్మాణాలు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా నేటి వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఉపాధి అధికారుల కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 172 మినీ గోకులాలు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటివరకు 148 షెడ్లు పూర్తికాగా, మిగిలిన వాటిలో వివిధ దశల్లో నిర్మాణాలు వదిలేశారు.

#### అధికార పార్టీవారే అధికం

మినీ గోకులాల లబ్దిదారుల్లో దాదాపుగా 80 శాతం మంది కూటమి సానుభూతి పరులే ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే నిర్మాణాలు మొదలవ్వడంతో ఆయా గ్రామాల కూటమి నాయకులు వారికి అనుకూలమైన వారికి షెడ్లు మంజూరు చేయించారు. పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ అధికారులు కూడా కూటమి నేతలు సూచించిన వారి పేర్లను ఎంపిక చేసి వారికే షెడ్లను కట్టబెట్టారు. వారిలో కొందరు 6 పశువుల షెడ్లను రూ.2.30 లక్షల వ్యయంతో, 4 పశువుల షెడ్లను రూ.1.85 లక్షల వ్యయంతో అప్పుచేసి మరీ నిర్మించారు. వీటిలో పది శాతం లబ్ధిదారుని వాటా పోనూ మిగిలిన మొత్తం వారి ఖాతాకు జమ కావాల్సింది. కానీ ఇప్పటికి ఆరు నెలలు గడిచిపోతున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

| మినీ గోకులాల వివరాలు | మండలం | హిరమండలం | పాతపట్నం | కొత్తూరు | మెళియాపుట్టి | ఎల్ఎన్‌పేట |
|---|---|---|---|---|---|---|
| | మంజూరైనవి | 39 | 31 | 41 | 44 | 17 |
| | పూర్తయినవి | 36 | 22 | 35 | 38 | 17 |
| | వివిధ దశల్లో ఉన్నవి | 3 | 9 | 6 | 5 | 01 |

#### అప్పు చేసి నిర్మించాం



వర్షాలు, ఎండల సమయంలో పాడి పశువులను కట్టడానికి ఇబ్బందిగా ఉందని గోకులం షెడ్ మంజూరు అవ్వడంతో అప్పులు చేసి నిర్మాణం చేపట్టాను. అయితే బిల్లు మాత్రం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా మా ఖాతాలో జమ అవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు వచ్చేలా చూడాలి.

– పుట్టంశెట్టి రమేష్, మినీ గోకులం లబ్ధిదారుడు, పాత హిరమండలం

#### త్వరలో బిల్లులు చెల్లింపు



మినీ గోకులాల షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం త్వరలోనే బిల్లులు చెల్లిస్తుంది. షెడ్ల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ అవుతుంది.

– ఎ.శ్రీనివాసరావు, ఉపాధి ఏపీవో, హిరమండలం